క్లుప్తంగా

బాధ్యతలు స్వీకరించిన వీఆర్వోలు

రుద్రవరం: మండలంలోని నాలుగు సచివాలయాల్లో వీఆర్వోలు బాధ్యతలు స్వీకరించారు. శుక్రవారం ఈ మేరకు వారు తమ నియామక పత్రాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డికి అందజేశారు. కర్నూలు అర్బన్ నుంచి బదిలీపై వచ్చిన వారితో కోటకొండ సచివాలయం వీఆర్వోగా గురుస్వామి, పెద్దకంబలూరుకు వెంకటేశ్వర్లు, ముత్తలూరుకు ఉశేన్, రుద్రవరం–2కు నాగనరసింహుడు విధుల్లో చేరారు. మండల పరిషత్ ఏఓ వరలక్ష్మి, పీఆర్ ఏఈ వెంకటరాముడు ఉన్నారు.

తొలిపంటకు శ్రీకారం



మినుము పంట సాగు చేస్తున్న రైతులు

దొర్నిపాడు: రైతుల ఆశలు నెరవేర్చే దిశగా తొలకరి వానలు పలకరించాయి. దీంతో తొలి పంటగా మండలంలో ఏటా మినుము పంట సాగుచేస్తారు. రెండు రోజులుగా భారీ వర్షాలు కురవడంతో రైతులు ఖరీఫ్‌లో భాగంగా మినుము పంట విస్తారంగా సాగుచేసేందుకు శ్రీకారం చుట్టారు. గతేడాది మండలంలో 621 హెక్టార్లలో మినుము సాగుచేశారు. ప్రస్తుతం మార్కెట్‌లో మినుము ధర క్వింటా రూ.8,500 నుంచి రూ.8,800 వరకు ఉంది. వర్షాలు అనుకూలిస్తే పంట చేతికి వస్తుందని, లేదంటే వరి సాగుకు పచ్చిరొట్ట ఎరువుగా మార్చుకుంటామని రైతులు పేర్కొంటున్నారు.

వీఆర్వోల బదిలీ

శిరివెళ్ల: మండలంలో వీఆర్వోల బదిలీలు, నియామకాలు జరుగుతున్నాయి. స్థానిక 1వ గ్రామ సచివాలయం వీర్వోగా బోయలకుంట్లలో పనిచేస్తున్న భాస్కరెడ్డి నియమితులయ్యారు. యర్రగుంట్ల వీఆర్వోగా నాగరాజు, బోయలకుంట్లకు కృష్ణయ్య నియమితులయ్యారు. అలాగే తహసీల్దార్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్‌గా నారాయణరెడ్డి నియమితులయ్యారు. అలాగే గ్రామ సచివాలయ సిబ్బంది బదిలీలు, నియామకాలు జరుగుతున్నాయి. స్థానిక 4వ గ్రామ సచివాలయ ఇంజినీర్ అసిస్టెంట్‌గా శ్రీకాంత్, కోటపాడు సచివాలయ డిజిటల్ అసిస్టెంట్‌గా సురేష్‌ను నియమించారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి

నంద్యాల(వ్యవసాయం): శ్యాంప్రసాద్ ముఖర్జీ బలిదాన దినోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం బీజేపీ కార్యాలయంలో పట్టణ అధ్యక్షుడు ఫిరంగి బ్రహ్మయ్యచారి ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ అఖండ భారతావణి కోసం ప్రాణాలర్పించాడని, జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్రీ శ్యాంప్రసాద్ ముఖర్జీ అని కొనియాడారు. నాయకులు కొట్టె కృష్ణమూర్తి, గోపాలకృష్ణమూర్తి, శివారెడ్డి, పట్టణ వైస్ ప్రెసిడెంట్ ఐనుగూరు రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, జయభార్‌రెడ్డి పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఉయ్యాలవాడ : రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపా రు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ బియ్యం తరలిస్తున్నారనే సమాచారం మండలంలోని నర్సిపల్లె గ్రామసమీపంలో బొలేరో గూడ్స్ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న 1,250 కేజీల బియ్యాన్ని, డ్రైవర్ మధును తమ అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. డ్రైవర్‌ను విచారించగా కోవెలకుంట్ల మండలం గుళ్లదుర్తి గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డికి సంబంధించినవిగా చెప్పారన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

ముగిసిన శిక్షణ

నంద్యాల (సెంట్రల్): స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం(ఆర్‌ఏఆర్‌ఎస్) లో తేనెటీగల పెంపకంపై ఏడు రోజుల పాటు జరిగిన శిక్షణ శుక్రవారం ముగిసింది. పరిశోధనా స్థానం సహ సంచాలకులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ చెంచు మహిళలు తేనెటీగల పెంపకాన్ని ఓ కుటీర పరిశ్రమగా మార్చుకుని ఆదాయం పొందాలని సూచించారు. సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ పథక సంచాలకులు రవీంద్రనాథ్‌రెడ్డి , ఉద్యానశాఖాధికారి నాగరాజు గిరిజనులకు అవగాహన కల్పించారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి



కరపత్రాలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే శిల్పారవి, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల(సెంట్రల్): ప్రతి నీటి చుక్క విలువైనదని, జాగ్రత్తగా ఉపయోగించుకుంటే కొరతకు తావుండదని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా యూనిసెఫ్, వరల్డ్ విజన్ స్వచ్ఛంద సంస్థ ఏర్పాటు చేసిన ప్రచార రథాన్ని ఎమ్మెల్సీ ఇసాక్ బాషాతో కలిసి ప్రారంభించారు.

సన్మానం

నంద్యాల(రూరల్): నంద్యాల రెవెన్యూ శాఖలో ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్‌గా రామనాథరెడ్డి సేవలు అమోఘమని నంద్యాల తహసీల్దార్ బి.శ్రీనివాసులు కొనియాడారు. డిప్యూటీ తహసీల్దార్‌గా ఉంటూ ఇటీవల పదోన్నతి పొంది సత్యసాయి జిల్లా ఓడీ చెరువు మండల తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆయనకు గురువారం పట్టణంలోని నిశాంత్ భవనంలో ఘనంగా సన్మానించారు. డీటీ నాగరాజు, వీఆర్‌ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణ పాల్గొన్నారు.

నిశ్చింతగా సాగేలా..

- కర్షకులకు అండగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం
- ఖరీఫ్‌నకు ముందే 'వైఎస్సార్ రైతు భరోసా'
- వంద రోజుల్లోపే పంట నష్టపరిహారం విడుదల
- రైతుల ఖాతాలోరూ 25.08 కోట్ల రైతుభరోసా, రూ. 65 లక్షల పెట్టుబడి రాయితీ సొమ్ము జమ



మిరప చేలో సేద్యం చేస్తున్న దృశ్యం



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

ఆళ్లగడ్డ: నాలుగేళ్ల క్రితం వరకు అన్నదాత కష్టాలు ఎవరికీ పట్టలేదు. తమ పరిస్థితి ఇంతేలే.. అనకుంటూ సర్దుకుపోయారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వ్యవసాయ విధానంలో దేశంలో ఎక్కడా లేని విధంగా సమూలంగా ప్రక్షాళన చేసి సరికొత్త విధానాలతో రైతులకు సాగును సులభంగా మార్చేసింది. అప్పటి వరకు వ్యవసాయం భారమై కాడి వదిలేద్దామనుకున్న వారు జగనన్న పథకాలతో రైతులు సంతోషంగా పంటలు సాగు చేస్తున్నారు. కౌలు రైతులకు కూడా పథకాలు వర్తింపజేస్తుండటంతో వారిలో ఆనందం వ్యక్తమవుతోంది.

రైతుల ఖాతాలో వైఎస్సార్ రైతు భరోసా..

2023– 24 ఆర్థిక సంవత్సరానికి గాను 'వైఎస్సార్ రైతు భరోసా' సొమ్ములు అర్హులైన అన్నదాతల ఖాతాల్లో జమ చేసింది. నియోజవర్గంలోని 6 మండలాల పరిధిలోని 45,607 మంది అన్నదాతల ఖాతాల్లో ఈ ఏడాది మొదటి విడత పెట్టుబడి సాయం కింద రూ.25,08,42,500 జమ చేసింది. దుక్కులు దున్నుకునేందుకు, విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసేందుకు ఈ సొమ్ము ఉపయోగపడుతుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

నష్టపోయిన రైతులకు బీమాతో భరోసా..

ప్రకృతి వైపరిత్యాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వంఅండగా నిలుస్తోంది. ఉచిత పంటల బీమాతో భరోసా కల్పించింది. పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీని జమ చేస్తుంది. అది కూడా ఏ సీజన్‌లో నష్టపోయిన పంటకు అదే సీజన్‌లో పరిహారం అందజేస్తుండటం విశేషం. గత ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన రైతుల ఖాతాల్లో ప్రభుత్వ పరిహారం జమ చేసింది.

రూ.65 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ...

ఈ ఏడాది మార్చిలో వడగండ్ల వర్షం బీభత్సం సృష్టించింది. దీంతో నియోజకర్గంలోని రైతులు తీవ్రంగా నష్టపోయారు. నష్టం జరిగిన మూడు నెలల్లోపే అధికారకులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి 6 మండలాల పరిధిలో 5,319.63 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం జరిగిందని అంచనాలు సిద్ధం చేశారు. ప్రభుత్వం వెంటనే నష్టపోయిన 6,617 మంది రైతుల ఖాతాల్లో రూ.65 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేసింది.

మండలాల వారీగా పంట నష్ట పరిహారం వివరాలు..

మండలం	నష్టపోయిన రైతులు	దెబ్బతిన్న పంటలు హెక్టార్లలో	విడుదలైన ఇన్‌పుట్ సబ్సిడీ
ఆళ్లగడ్డ	2302	1777.91	రూ.6.86 లక్షలు
చాగలమర్రి	1286	1264.77	రూ.0.06 లక్షలు
శిరివెళ్ల	120	109.34	రూ.3.37 లక్షలు
రుద్రవరం	1590	1113.67	రూ.0.41 లక్షలు
ఉయ్యాలవాడ	1312	1047.5	రూ.54.24 లక్షలు
దొర్నిపాడ	7	6.44	రూ.0.49
మొత్తం	6617	5319.63	రూ.65.43 లక్షలు

మండలాల వారీగా వైఎస్సార్ రైతు భరోసా మొదటి విడత లబ్ధిదారులు..

మండలం	లబ్ధి పొందిన రైతులు	విడుదలైన నిధులు
ఆళ్లగడ్డ	10056	రూ. 55308000
రుద్రవరం	9758	రూ. 53673000
చాగలమర్రి	7155	రూ. 39352500
శిరివెళ్ల	8739	రూ. 48064500
ఉయ్యలవాడ	5839	రూ. 29639500
దొర్నిపాడు	4510	రూ. 24805000
మొత్తం	45607	రూ. 250842500

నష్టాల బాట నుంచి గట్టెక్కించారు



ఐదు ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశా. పంట బాగా పండింది. ధర కూడా బాగా ఉండటంతో మంచి ఆదాయం వస్తుందని, రెండు రోజుల్లో కోత కోయాలని మిషన్, కూలీలను కూడా మాట్లాడుకున్నాం.అంతలో మార్చి 17న రాత్రి కురిసిన వడగండ్లవానకు పంట పూర్తిగా దెబ్బతినింది. అయితే మూడు నెలల్లోపే ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద నాకు రూ.20 వేలు విడుదల చేశారు.దీంతో నష్టాలబాటనుంచి గట్టెక్కించారు.
– వెలుగోడు పుల్లారెడ్డి, రైతు, పాతకందుకూరు

వ్యవసాయాన్ని పండుగలా మార్చారు



రైతులకు ప్రభుత్వం వివిధ రకాల పథకాలు అందజేసి అడుగడుగునా అండగా నిలుస్తోంది. ము ఖ్యంగా రైతు భరోసా, పంటల బీమా, మద్దతు ధర, సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేస్తుండటంతో అన్నదాతలకు చాలా వరకు భారం తగ్గింది. దీంతో వ్యవసాయం భారంగా కాకుండా పండుగలా మార్చి చూపారు.
– దశర థరామిరెడ్డి, అమ్మిరెడ్డినగరం

పారదర్శకంగా పథకాల అమలు



ప్రభుత్వం రైతు భరోసా, ఇన్‌పుట్ సబ్సిడీ పథకాలను చేపట్టింది. ఇందులో ఏ ఒక్క సాగు దారుడు నష్టపోకుండా పూర్తి పారదర్శకంగా జాబితాను తయారు చేస్తున్నాం. అర్హులైన ఏ ఒక్క రైతు నష్టపోకూడాదన్నదే ప్రభుత్వ లక్ష్యం .
– రామ్మోహన్ రెడ్డి,ఏడీఏ

దట్టమైన అడవిగా మార్చేందుకు కృషి

రుద్రవరం: నల్లమల అటవీ ప్రాంతాన్ని దట్టమైన అడవిగా మార్చేందుకు కృషి చేస్తున్నామని రుద్రవరం రేంజి అధికారి శ్రీపతినాయుడు తెలిపారు. స్థానిక అటవీ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ రేంజి పరిధిలోని పలు సెక్షన్లు, బీట్లలో అక్కడక్కడ బయలు ప్రదేశాలను గుర్తించామని, ఆయా ప్రాంతాల్లో మొక్కలు నాటించి వృక్షాలుగా పెంచి దట్టంగా మార్చేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఇందుకు తగిన వాతావరణం మొదలైందని, వర్షాలు కురుస్తుండటంతో తమ పని సులువవుతుందని చెప్పారు. ఇందులో భాగంగానే హరినగరం వద్ద ఉన్న సోషల్ ఫారెస్టు నర్సరీ నుంచి నెమలినార, నారేపి, నేరేడు, జిట్టేగి, ఎర్రచందనం తదితర జాతులకు చెందిన 800 మొక్కలను ట్రాక్టరులో డీ.వనిపెంట సెక్షన్‌కు తరలించారు. అక్కడి సిబ్బంది ఇదివరకే గుర్తించిన బయలు ప్రదేశాల్లో వాటిని నాటించి సంరక్షిస్తారని వివరించారు.



డీ.వనిపెంట సెక్షన్‌కు ట్రాక్టరులో మొక్కలను తరలిస్తున్న దృశ్యం

1నుంచి 'జగనన్న సురక్ష'

గోస్పాడు: గ్రామాలలో ప్రజలకు అవసరమైన సేవలు అందించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న జగనన్న సురక్ష పథకాన్ని సక్రమంగా నిర్వహించేలా చూడాలని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 1వ తేదీ నుంచి గ్రామాల్లో మండల స్థాయి అధికారుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలను అక్కడికక్కడే అందజేస్తారని చెప్పా. అందులో భాగంగా 1న జూలేపల్లె, 4న పసురపాడు, 6న సాంబవరం, 11న కానాలపల్లె, 13న దీబగుంట్ల, 15న నెహ్రూనగర్, 18న ఎం.కృష్ణాపురం, 20న ఒంటి వెలగల, 22న గోస్పాడు, 25న జిల్లెల్ల, 27న యాళ్లూరు–1, 29న యాళ్లూరు–2 సచివాలయాల పరిధిలో సభలు నిర్వహిస్తామని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉయ్యాలవాడ :వచ్చేనెల 1నుంచి మండలంలో జగనన్న సురక్ష పథకాన్ని పకడ్బందీగా అమలు పరచేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో వారు మాట్లాడారు. జూలై 1న తుడుమలదిన్నె, 4న అల్లూరు, 5న మాయలూరు, 6న హరివరం, 11న సుద్దమల్ల, 12న ఆర్.జంబులదిన్నె, 13న పెద్దయమ్మనూరు, 18న బోడెమ్మనూరు, 19న కొండుపల్లె, 20న ఇంజేడు, 25న ఉయ్యాలవాడ గ్రామ సచివాలయాల్లో సదస్సులుంటాయని వివరించారు.

కాళికాంబకు సారె సమర్పణ



అలంకరణలో కాళికాంబ


నంద్యాల(వ్యవసాయం): స్థానిక గాంధీచౌక్‌లో వెలసిన శ్రీకాళికాంబ చంద్రశేఖర దేవస్థానంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని భక్తులు శుక్రవారం పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించి ఆషాడ సారెను భక్తిశ్రద్ధలతో సమర్పించారు. అమ్మవారి మూల విరాట్‌కు వేదపండితుల ఆధ్వర్యంలో పంచామృతాభిషేకాలు, వివిధ రకాల పండ్ల రసాలతో అభిషేకం అనంతరం పట్టువస్త్రాలు, పచ్చిటెంకాయలతో అలంకరించారు. అనంతరం అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం నిర్వహించి శ్రీకాళిమాత సేవా సమాజ్ సభ్యులు 1008 టెంకాయలు సమర్పించారు. అలాగే.. జగజ్జననీ ఆలయంలో తెలంగాణ, చాగలమర్రి, కర్ణాటక ప్రాంతాల భక్తులు మేళతాళాలతో అమ్మవారికి సారె సమర్పించారు. 39వ వార్డులో వెలసిన శ్రీనాలింగేశ్వర ఆలయంలో కౌన్సిలర్ వెంకటలక్ష్మి నాగ దేవతకు సారె సమర్పించారు.



జగజ్జననీ మాతకు సారెను సమర్పించిన భక్తులు

గృహ నిర్మాణాలు పూర్తి చేయాలి

ఉయ్యాలవాడ : గడువు లోపు గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ పీడీ భాస్కర్ నాయుడు సూచించారు. శుక్రవారం సాయంత్రం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గృహ నిర్మాణ శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ జిల్లాలో 10,699 గృహాలు వివిధ దశల్లో నిర్మాణాలు సాగుతున్నాయన్నారు. 4,200 గృహాలు పూర్తయ్యాయని, వాటి కోసం రూ. 21.42 కోట్లు ప్రభుత్వం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేసిందన్నారు. జూలై 31వ తేదీలోగా నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు ముమ్మరం చేశామని చెప్పారు. జిల్లాలో 3,591 మంది నిర్మాణాలు మధ్యలోనే నిలిపివేయడంతో వారు నిర్మాణాలు చేపట్టేలా ప్రభుత్వ ఆదేశాల మేరకే రూ. 20 వేల చొప్పున అడ్వాన్స్ వారి వ్యక్తి గత ఖాతాల్లో జమ చేస్తామన్నారు. హౌసింగ్ డీఈ నాగరాజు, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఏఈ నరసింహారావు, వర్క్ ఇన్‌స్పెక్టర్ షాదిక్‌బాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా హౌసింగ్ పీడీ భాస్కర్‌నాయుడు

'జగనన్న సురక్ష'తో సమస్యల పరిష్కారం

ఆళ్లగడ్డ: అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని నిజమైన లబ్ధిదారుల సమస్యలు 'జగనన్న సురక్ష'తో సత్వరం పరిష్కరించేందుకు అవకాశం ఉంటుందని ఎంపీపీ గజ్జల రాఘవేంద్రారెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం సమావేశ భవనంలో శుక్రవారం వలంటీర్లు, సచివాలయాల సిబ్బంది, గృహసారథులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మహబూబ్‌ఖాన్, తహసీల్దార్ హరినాథరావు ఉన్నారు. అలాగే.. మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు ఆధ్వర్యంలో పట్టణంలోని వలంటీర్లు, వార్డు సచివాలయ సిబ్బంది, గృహసారథులతో సమావేశం నిర్వహించారు.

దొర్నిపాడు: జగనన్న సురక్ష పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని గుండుపాపల గ్రామ సచివాలయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, గృహసారథులతో ఆయన సమావేశం నిర్వహించారు.

ఉయ్యాలవాడ : జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అధికారులు సమిష్టి కృషితో మండలంలో విజయవంతం చేయాలని ఎంపీపీ బుడ్డా భాగ్యమ్మ, జెడ్పీటీసీ కసాని పుణ్యలక్ష్మిదేవి కోరారు. శుక్రవారం కార్యక్రమ ప్రారంభాన్ని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వీక్షించారు. ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, ఈఓపీఆర్‌డీ వెంకటేశ్వరరావు, పరిపాలనాధికారి సత్యన్న, ఏఓ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.

చాగలమర్రి: స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శుక్రవారం ఎంపీడీఓ మహబూబ్ దౌలా, ఎంపీపీ వీరభద్రుడు ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు కార్యక్రమ నిర్వహణపై సూచనలు చేశారు. ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన

గోస్పాడు: బాలికల ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలని నంద్యాల జిల్లా రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం అధికారి డాక్టర్ కాంతారావు నాయక్ అన్నారు. శుక్రవారం కౌమారుల ఆరోగ్యం–స్నేహపూర్వక క్లినిక్ కార్యక్రమంలో భాగంగా స్థానిక మోడల్ స్కూల్లో బాలికలకు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. శిబిరాన్ని పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం కౌమార దశ 10–19 సంవత్సరంలోపు బాలికలకు ప్రత్యేకంగా వైద్య పరీక్షలు చేసి ఆరోగ్య విషయాలపై వారికి అవగాహన కల్పిస్తామని చెప్పారు.

మలేరియాపై అప్రమత్తంగా ఉండండి

శిరివెళ్ల: మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని అసిస్టెంట్ మలేరియా అధికారి వరప్రసాదరెడ్డి తెలిపారు. శుక్రవారం మలేరియా మాసోత్సవం సందర్భంగా డాక్టర్ విజయకుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించా. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని, నీటి నిల్వలపై వేస్ట్ ఆయిల్ చల్లాలని, తాగునీరు కలుషితం కాకుండా చూడాలని చెప్పారు. సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటేశ్వరరెడ్డి, సీహెచ్‌ఓ రామ్మోహన్‌రెడ్డి, సూపర్‌వైజర్లు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి జైలు శిక్ష

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని శ్రీనివాస సెంటర్‌లో అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన వ్యక్తికి సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ రాంభూపాల్‌రెడ్డి జైలు శిక్ష ఖరారు చేశారని కోర్టు సిబ్బంది శుక్రవారం తెలిపారు. వివరాలు..షేక్‌మహబూబ్‌బాషా నంద్యాల శ్రీనివాససెంటర్‌లో వెళ్తున్న అమ్మాయిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించినందున టూటౌన్ పోలీసులు సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టులో హాజరు పరచగా 15రోజులు జైలు శిక్ష విధించారు.

వసతులు కల్పించాలి

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని నందమూరినగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం కాలనీలో మురికినీటితో నిండిన చెత్తా చెదారాన్ని పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, వీధి దీపాలు లేక ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు. హుసేన్‌సా, మాబాషా, రాము పాల్గొన్నారు.

యూజీ కోర్సుపై నేడు అవగాహన

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని పీఎస్సీ, కేవీఎస్సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం యూజీ కోర్సుపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ శశికళ శుక్రవారం తెలిపారు. ఆమె మాట్లాడుతూ నోడల్ రీసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో యూజీ కోర్సుపై అవగాహన సదస్సుకు రాయలసీమ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ ఆనందరావు ముఖ్య అతిథులుగా హాజరవుతారని చెప్పారు. సదస్సుకు అధ్యాపకులు, విద్యార్థులు హాజరు కావాలని కోరారు.

జిగురు అట్టలతో వైరస్ నివారణ

రుద్రవరం: మిరప పంటలో జిగురు అట్టల ఏర్పాటుతో వైరస్ వ్యాప్తిని నివారించుకోవచ్చని ఉద్యానశాఖ ఏఓ నరేష్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మండలంలోని నర్సాపురం,టీ.లింగందిన్నె,ఆర్.నాగులవరం ,రుద్రవరం గ్రామాల పరిధిలో రైతులు సాగు చేసిన మిరప పంటను శుక్రవారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రసం పీల్చే పురుగుల వృద్ధిని తగ్గించుకోవడానికి తగిన మోతాదులో పురుగు మందులు వాడాలని చెప్పారు. అలాగే పొలాల్లో నీలి, పసుపు,తెలుపు వంటి జిగురు అట్టలను అమర్చుకోవడం వల్ల వైరస్ వ్యాప్తి తగ్గుతుందన్నారు.

మట్కా బీటర్ల అరెస్ట్

ఆళ్లగడ్డ: పట్టణంలో మట్కా రాస్తున్న ఇద్దరు బీటర్లను శుక్రవారం అరెస్ట్ చేసినట్లు పట్టణ ఎస్‌ఐ వెంకటరెడ్డి తెలిపారు. భవాని థియేటర్ సమీపంలో కొందరు వ్యక్తులు మట్కా రాస్తున్నారని సమాచారం మేరకు వెళ్లి దాడులు నిర్వహించి అంకాలమ్మ, సుబ్బారెడ్డి అనే ఇద్దరిని అదుపులోకి తీసుకుని వారి నుంచి మట్కా చీటీలు, రూ.400 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

మహిళ అదృశ్యం

పట్టణంలోని కమేళా వీధికి చెందిన భారతి అనే మహిళ అదృశ్యమైందని ఎస్‌ఐ వెంకటరెడ్డి శుక్రవారం తెలిపారు. భారతి గురువారం ఉదయం బజారుకు వెళ్లి వస్తానని ఇంట్లో నుంచి వెళ్లింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో పలు చోట్ల విచారించినా ఫలితం లేకపోవడంతో తండ్రి వెంకటేశ్వర్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

జగనన్నతోనే పేదల అభివృద్ధి



మహిళకు బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవి

గోస్పాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే పేదల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే శిల్పా రవి చంద్రకిశోర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని జిల్లెల్ల గ్రామంలో శుక్రవారం రెండో రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మార్కెట్ చైర్మన్ పీపీ నాగిరెడ్డితో కలిసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ పథకాల ఫలాలను వివరించడంతో పాటు కరపత్రాలను ప్రజలకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలను ఉన్నత స్థితిలోకి తీసుకురావాలనే జగనన్న సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని చెప్పారు. పథకాలు అందుతున్నాయా లేదా, పాలన ఎలా ఉంది, సమస్యలు ఉన్నాయా అని తెలుసుకునేందుకే ఈ కార్యక్రమం చేపట్టారని, గతంలో దేశంలో ఎక్కడా ఇలాంటి కార్యక్రమం నిర్వహించిన దాఖలాలు లేవని చెప్పారు. ఇప్పటి వరకు అందజేసిన పథకాలతో పాటు నూతనం జగనన్న సురక్ష పేరుతో ప్రజలకు వేగంగా సేవలందించేందుకు చర్యలు చేపట్టారని చెప్పారు. కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ పీపీ మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ ఆర్థర్ సైమాన్, జిల్లెల సర్పంచ్ ఓబులమ్మ, నాయకులు జనార్దన్ రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శేఖర్ రెడ్డి, ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ శేఖర్, డీడీ రామచంద్రరావు, ఎంఈఓ అబ్దుల్ కరీం, ఏపీఓ నాగజ్యోతి పాల్గొన్నారు.

అవాస్తవాలు మాట్లాడితే సహించేదిలేదు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్ బాషా

నంద్యాల: టీడీపీ మైనార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మౌలానా అవాస్తవాలు మాట్లాడితే సహించేది లేదని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే శిల్పా రవి స్వగృహంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్సీ మాట్లాడుతూ మౌలానా ముస్తాక్ అహ్మద్ తనపై అసత్యపు ఆరోపణలు చేయడం తగదన్నారు. జామియా మసీద్ సంబంధించి వక్ఫ్ బోర్డు వారు ఎన్నికలు జరుపమని చెప్పినా ఎన్నికలు జరుపకుండా కబ్జా చేశాని చెప్పడంలో వాస్తవం లేదన్నారు. ఆరోపణలకు సాక్షాధారాలు చూపాలని సవాల్ విసిరారు. పోస్టాఫీస్ ఎదురుగా అక్రమ నిర్మాణాలు చేపట్టానని ఆరోపించడం ఎంతవరకు సమంజసమన్నారు. టీడీపీ హయాంలోనే కట్టడాలకు అనుమతులు ఇచ్చారని, ఇందుకు సంబంధించిన పత్రాలను చూపారు. మార్కెట్ యార్డులో అవినీతి చేశానంటున్నారని, తాను చైర్మన్‌గా ఉన్నంత కాలంలో యార్డును అభివృద్ధి చేశానని వివరించారు. వ్యక్తిగత విషయాలను ప్రస్తావిస్తే పరువు రోడ్డున పడుతుందని, నోరు మూసుకొని ఉండాలని హితవు పలికారు. ఆత్మకూరు, నంద్యాలలో రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఎవరికి ఎంత ఇచ్చావో ఎంత మందిని ముంచావో తెలుసన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నీసా, మైనార్టీ నాయకులు జాకీర్ హుసేన్, మార్కెట్ కలాం పాల్గొన్నారు.

క్రైం కార్నర్

కేసు నమోదు

ఉయ్యాలవాడ : మండలంలోని పెద్దయమ్మనూరు గ్రామంలో ఇంటి ముందు కళ్లాపి చల్లే విషయంలో ఘర్షణ చోటు చేసుకోవడంతో ఇరువర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన బత్తుల గంగమ్మ తన ఇంటి ముందు కళ్లాపి చల్లే సమయంలో గోపాల్‌పై నీళ్లు పడ్డాయి. దీంతో గోపాల్, సుబ్బరామయ్య, బాలకృష్ణ గంగమ్మను దుర్భాషలాడుతూ ఇంట్లోనున్న కోడలిని చీర పట్టుకుని లాగాడని గంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. అలాగే వెంకటరమణయ్య, వెంకటలక్ష్మమ్మలు బత్తుల లక్ష్మిపై దాడి చేసి గాయపరచారు. లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

దొర్నిపాడు: మండలకేంద్రానికి చెందిన పద్మావతి అనే మహిళపై ఉశేనమ్మ, షబానా, ఆశాబీ, చిన్నఉసేని అనే నలుగురు దాడి చేశారని ఎస్‌ఐ తిరుపాల్ శుక్రవారం తెలిపారు. ఇంటి ముందు రోడ్డుపై నీళ్లు పోస్తున్నారనే విషయంపై ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో పద్మావతిపై దాడికి పాల్పడగా బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

గుర్తు తెలియని వాహనం ఢీ కొని ఫైర్‌మెన్ దుర్మరణం



సంజీవరాయుడు (ఫైల్)

ఆళ్లగడ్డ: బత్తలూరు, నల్లగట్ల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫైర్‌మెన్ సంజీవరాయుడు (42) దుర్మరణం చెందిన సంఘటన శుక్రవారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. రూరల్ ఎస్‌ఐ నరసింహులు తెలిపిన వివరాల మేరకు.. సంజీవరాయుడు ఆళ్లగడ్డ అగ్నిమాపక శాఖలో ఫైర్‌మెన్‌గా, భార్య నాగలలిత ప్రభుత్వ ఉపాధ్యాయినిగా విధులు నిర్వహిస్తుండేవారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇద్దరూ నంద్యాలకు బదిలీ అయ్యారు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి విధులు ముగించుకున్న సంజీవరాయుడు ఆళ్లగడ్డలో బాడుగ ఇళ్లు ఖాళీ చేసి సామాన్లు నంద్యాలకు తరలించేందుకు తెల్లవారుజామున తన బైక్‌పై ఆళ్లగడ్డకు బయలు దేరాడు. ఈ క్రమంలో బత్తలూరు, నల్లగట్ల గ్రామాల మధ్య వెనుకనుంచి గుర్తుతెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో సంజీవరాయుడు అక్కడిక్కడే మృతి చెందాడని, భార్య నాగలలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ వివరించారు.

వివక్షను నిర్మూలించాలి

చాగలమర్రి: వితంతువుల పట్ల మూఢనమ్మకాలు, వివవక్షను నిర్మూలించాలని బర్డ్స్ డైరెక్టర్ పాల్ రాజారావు అన్నారు. అంతర్జాతీయ వితంతువుల దినోత్సవం సందర్భంగా ముత్యాలపాడు గ్రామంలోని బర్డ్స్ బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో వితంతువులతో కలిసి శుక్రవారం ర్యాలీ నిర్వహించారు.

నిందితులను శిక్షించాలి

బొమ్మలసత్రం: గోనెగండ్ల మండలం గంజహళ్లి గ్రామంలో బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించాలని నంద్యాల అసెంబ్లీ సగర సంఘం అధ్యక్షుడు టైలర్ శివయ్య కోరారు. శుక్రవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బహిర్భూమికి వెళ్లిన 12 ఏళ్ల చిన్నారిపై కొందరు అత్యాచారానికి పాల్పడటం దుర్మార్గమన్నారు. అసలైన నిందితులను వదిలిపెట్టడంపై అనుమానులున్నాయని చెప్పారు.

• జోరందుకున్న వ్యవసాయ పనులు



మిర్చి పంటలో కలుపు మొక్కలు తొలగిస్తున్న కూలీలు

రుద్రవరం: మూడు రోజులుగా మండలంలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దీంతో రైతులు వ్యవసాయ పనుల్లో నిమగ్నమయ్యారు. విత్తు విత్తడం, ఇదివరకే సాగు చేసిన మొక్కజొన్న, మిరప పంటల్లో కలుపు తొలగింపు, రసాయన ఎరువులు చల్లడం వంటి పనుల్లో బిజీగా ఉన్నారు. మూడు రోజులుగా కురిసిన వర్షానికి ముకుందాపురం గ్రామంలోని ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిలిచింది.